క్లుప్తంగా

ఎంపీడీఓగా వనజ



గూడూరు: మండల ఎంపీడీఓగా ఎం.వనజకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న టి.అనూహ్య ఇండక్షన్ ట్రైనింగ్‌కు వెళ్లడంతో ఈఓపీఆర్డీ బి.రాజేశ్వరి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ పరిపాలనా అధికారి ఎం.వనజకు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

అన్నసమారాధన



బంటుమిల్లి: స్థానిక సంత బజారు కోదండ రామాలయంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. శ్రీ రామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన అన్న సమారాధనలో బంటుమిల్లి, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జీ తాతయ్య, నాని, బుజ్జి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయిలో అంబేడ్కర్ జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు మచిలీపట్నం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాలంకరణ కార్యక్రమం చేస్తారన్నారు. అనంతరం జిల్లా స్థాయి జయంతి కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో 10.30 గంటలకు నిర్వహించటం జరుగుతుందన్నారు. నగరంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలిక వసతి గృహంలోని విద్యార్థిని, విద్యార్థులతో అభిప్రాయ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో పాటు ఎస్సీ సంఘాల నాయకులు, విద్యావేత్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని షాహెద్‌బాబు కోరారు.

ఆశ్రమంలో అనాథ వృద్ధురాలి నేత్రదానం



నాగాయలంక: స్థానిక ఒకటో వార్డులోని వృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథ వృద్ధురాలు దేవరకొండ రేణుకమ్మ(89) అనారోగ్యంతో శనివారం మరణించింది. ఆమె నేత్రాలు విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఆమె మేనల్లుడు మాదివాడ నాగరాజు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకు వచ్చి అంగీకారం చెప్పడంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ సహకారంతో కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణుడు సాయి వచ్చి మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకు వెళ్లారు.

అంబేడ్కర్ పార్కులో లైటింగ్ ఏర్పాటు చేయండి



పెడన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ పార్కును పరిశుభ్రం చేసి, లైటింగ్ ఏర్పాటు చేయాలని సీనియర్ కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త కటకం ప్రసాద్ మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావుతో కలిసి పార్కును సందర్శించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. పార్కులో ఎక్కడా అపరిశుభ్రంగా ఉండకూదన్నారు. విగ్రహాన్ని పరిశుభ్రం చేయాల్సిందిగా తెలిపారు. అనంతరం లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని మున్సిపల్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించడానికి తగు చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలి

లంకపల్లి(ఘంటసాల): ఇంటి పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులను కోరారు. లంకపల్లి పంచాయతీలో ఈవో నాగ నాంచారమ్మ, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి శనివారం ఇంటి పన్నులు వసూలు చేశారు. మండలంలో అచ్చెంపాలెం, చిలకలపూడి, చినకళ్లేపల్లి, చిట్టూరు, చిట్టూర్పు, దేవరకోట,ఘంటసాలపాలెం, గోగినేనిపాలెం, కొత్తపల్లి, పూషడం, వి.రుద్రవరం గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేసినట్లు ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు తెలిపారు. మిగిలినగ్రామాల్లో కూడా నూరుశాతం పన్ను లు వసూళ్లు చేసేందుకు కృషి చేయాలన్నారు.

సంపద సృష్టి సాధ్యమేనా ?

- చెత్తను తగలబెడుతున్న వైనం
- ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- రీసైక్లింగ్‌కు వినియోగించని అధికారులు

చల్లపల్లి: సంపదను సృష్టించే చెత్తను తగలబెడితే నేరమని, దానిని తడి... పొడి చెత్తలుగా వేరుచేసి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలని ఓ పక్క పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇందుకు గాను చెత్తను వేర్వేరుగా వేసేందుకు రెండు రకాల డబ్బాలు సైతం ప్రజలకు పంపిణీ చేశారు. చెత్త నుంచి సంపదను తయారు చేసేందుకు ప్రత్యేక కేంద్రాలను సైతం నెలకొల్పారు. ప్రజలు సూచనలు పాటిస్తున్నా అధికారులు ఆచరించడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించే ప్రయత్నం చేయకుండా దానిని తగలబెడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలకు తిలోదకాలిస్తున్నారు. చల్లపల్లి మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ ఏరియాలో చల్లపల్లి–మచిలీపట్నం ప్రధాన రోడ్డు జాతీయ రహదారిని కలిసే ప్రాంతం వద్ద ఊర్లో ఉన్న చెత్తంతా ఇక్కడే వేస్తారు.



చెత్తను ఇక్కడ నిల్వచేసి నిత్యం తగలబెట్టడంతో రోడ్లను కమ్మేస్తున్న పొగ

ఇక్కడ వేసిన చెత్త నిత్యం మండుతూ పొగ కమ్ముతూ ఉంటోంది.

వాహనదారులకు ఇక్కట్లు..

దీని నుంచి వచ్చే దట్టమైన పొగ రోడ్డుపైకి వ్యాపించి ప్రజలను, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పొగ వల్ల ఊపిరి ఆడక ఆ రోడ్డున పోయేవారు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అంతేకాకుండా దాని నుంచి వెలువడే దుర్గంధాన్ని భరించలేక ముక్కు, నోరు రెండూ మూసుకుంటున్నారు. ఎప్పుడెప్పుడు ఈ ప్రాంతాన్ని దాటతామా అనుకుంటూ ఊపిరి బిగబట్టి పాదచారులు పరుగులు తీస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో పొగ ఎక్కువగా ఉన్నప్పుడు ఎదురుగా ఎవరు వస్తున్నారో.... ఏయే వాహనాలు వస్తున్నాయో కనిపించని దుస్థితి. దీంతో ద్విచక్ర, వాహనదారులు పట్టపగలు మిట్టమధ్యాహ్నం సమయంలో కూడా లైట్లు వేసుకుని తమ ఉనికిని చాటుకుంటూ ఊపిరి బిగబట్టి ముందుకు సాగుతున్నారు. నిత్యం ఇక్కడ చెత్తను కాల్చటం వల్ల వచ్చే పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రధాన రహదారులకు పక్కన చెత్తను తగలబెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.

చేపల వేట నిషేధం అమలుకు సహకరించండి

నాగాయలంక: మండలం పరిధిలోని సముద్ర జలాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి చేపలవేట నిషేధం అమలులోకి వస్తున్నందున మెకనైజ్డ్, మోటారు బోట్లతో వేట సాగించే మత్స్యకారులు 61 రోజుల పాటు నిషేధం అమలునకు సహకరించాలని స్థానిక మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.సునీత కోరారు. ఈమేరకు గ్రామ మత్స్య సహాయకుడు (వీఎఫ్ఏ) బీహెచ్.జగదీష్‌తో కలిసి నాగాయలంక కృష్ణా తీరంలో బోటు యజమానులకు శనివారం నోటీసులను ఆమె స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 10 ఫిష్ లాండింగ్ సెంటర్ల పరిధిలో 950 మోటారు బోట్ల ద్వారా సాగించే అన్నిరకాల చేపల వేట నిషేధంలోకి వస్తుందన్నారు. గ్రామ మత్స్య సహాయకులు, సాగరమిత్రలు, స్థానిక మత్స్యసహకార సంఘాల నాయకులు అప్రమత్తంగా ఉండి నిషేధం అమలులో ప్రభుత్వ మత్స్యశాఖ అధికారులకు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. కృష్ణా జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు, సాగరమిత్రలు, వి.ఎఫ్.ఎలు పాల్గొన్నారు.



బోటు యజమానులకు నోటీసులు అందజేస్తున్న ఎఫ్‌డీఓ సునీత, వీఎఫ్ఏ

చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలి

పెడన: పట్టణంలోని మఠం వీధి కళాంజలి హైస్కూల్‌లో శనివారం అవార్డ్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎన్‌ఫోర్సుమెంట్ అండ్ ఎక్సైజ్ సీఐ పరసా వెంకటేశ్వరమ్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు, ఆటపాటలలో రాణించాలన్నారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రతి తరగతిలో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో మార్కులు సాధించిన విద్యార్థులకు, అబాకస్, వేదిక్ మ్యాథ్స్, స్పెల్బీ, ఐబిటీ మ్యాథ్స్, క్విజ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు, స్కూలుకు అత్యధిక రోజులు హాజరైన విద్యార్థులకు బహుమతులను ఆమె అందజేశారు. ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్– 2025లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. స్కూలు ప్రిన్సిపల్ కె.దిలీప్‌కుమార్, కరస్పాండెంట్ కె.ప్రసన్నలక్ష్మి, కళాంజలి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవార్డులు స్వీకరించిన విద్యార్థులతో సీఐ వెంకటేశ్వరమ్మ తదితరులు

ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం



పెడన: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం స్ట్రాంగ్ రూం, వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ మాట్లాడుతూ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మార్గ నిర్దేశకత్వంలో కలిదిండి వాస్తవ్యులు దాత లక్ష్మీపురపు అజయ్‌బాబు సహకారంతో నూతన స్ట్రాంగ్ రూం నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు అగస్త్యయ్య పూజాక్రతువులు నిర్వహించిన అనంతరం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. చందన నారాయణరావు, కట్టా హేమసుందరమూర్తి, ఊటుకూరి ప్రకాశరావు, మామిడి ప్రసాదరావు, జక్కుల బసవేశ్వరరావు, వాసా సాంబశివరావు, ఇమ్మడి నాగపోతారావు, వీణం శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



మైథిలి (944/1000)

పెడన: పట్టణంలో పలు కళాశాలలో విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపించారు. పెడన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో 80 శాతం సాధించి జిల్లాలో నాలుగో స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ కేసీఎస్‌వీఎస్ రామారావు తెలిపారు. అన్ని గ్రూపులలో ప్రథమ సంవత్సరంలో 75 మంది పరీక్షలకు హాజరవ్వగా 57 మంది ఉత్తీర్ణులయ్యారని, ద్వితీయ సంవత్సరంలో 42 మందికి గాను 34 మంది పాస్ అయ్యారని అన్నారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ ఓఏఎస్ గ్రూపులో పేరం మహాలక్ష్మి (476/500) జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సీఈసీలో ఎస్‌వీ ప్రవళిక (470/500) సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో షేక్ మొబినా(938/1000)లు సాధించినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 45 మంది విద్యార్థినులు హాజరవగా 37 మంది ఉత్తీర్ణులయ్యారని, ద్వితీయ సంవత్సరానికి 43 మంది విద్యార్థినులు హాజరవ్వగా 38 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ ఎన్.రూతమ్మ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఎంఈసీలో తానంకి మైథిలి (944/1000), గోసాల సిరి (847/1000) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ గ్రూపులో ఉయ్యాల పావని (935/1000), బొడ్డు నవ్య (894/1000) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో ఎస్.ఝాన్సీ వాత్సల్య (425/500), జి.భువన అర్చన దుర్గ (420/500) మార్కులతో ఫస్ట్, సెకండ్ స్థానాల్లో ఉన్నారని తెలిపారు. జూనియర్ ఇంటర్ సీఈసీ గ్రూపులో కొచ్చెర్ల మల్లిక (464/500), నువ్వుల మౌనిక (396/500)లతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఐదుగురికి ఒకరు మాత్రమే ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో– 2 వైవీ హరనాథ్ తెలిపారు.

రాష్ట్రస్థాయిలో మైథిలి టాపర్..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో ఎంఈసీ గ్రూపులో ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఎంఈసీ గ్రూపులో తాణంకి మైథిలి (944/1000) మార్కులతో రాష్ట్రస్థాయిలోనే టాపర్‌గా నిలిచిందని బల్లిపర్రుగురుకుల ప్రిన్సిపాల్ రూతమ్మ తెలిపారు.

కోడూరు: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కోడూరు మారతీ జూనియర్ కళాశాల విద్యార్థుల మండలస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపీసీ గ్రూపులో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కడవకొల్లు లిఖిత, బెల్లంకొండ నాగలక్ష్మి 1000 మార్కులకు గాను 976 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. పాలాబత్తిన నిఖిల్ 968 మార్కులతో ద్వితీయస్థానం కైవసం చేసుకున్నాడు. సీఈసీ గ్రూపులో కొండవీటి గణేష్ 944, సజ్జా రాజేష్ 929 మార్కులతో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో తాతా శివమణి, అద్దంకి సాయికుమార్ 470 మార్కులకు గాను 456 మార్కులు సాధించి మండలం ఫస్ట్‌గా నిలిచారు. కొక్కిలిగడ్డ మౌనిక 447 మార్కులతో రెండవస్థానంలో నిలిచింది. సీఈసీ గ్రూపులో బడుగు సంతోష్ 500 మార్కులకు గాను 423 మార్కులు, తమ్ము లక్ష్మణ 415 మార్కులు సాధించారు. కళాశాలలో 90.5శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జేవీఎస్ఎస్ మూర్తి చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.



కడవకొల్లు లిఖిత (976)



బెల్లంకొండ నాగలక్ష్మి (976)

నాగాయలంక: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఎనిమిది మందికి ఆరుగురు ఉత్తీర్ణులై 75 శాతం ఫలితాలు నమోదు చేసారని పాఠశాల హెచ్.ఎం పీవీఎస్‌వీ ప్రసాద్ శనివారం తెలిపారు. వీరిలో విశ్వనాథపల్లి పవిత్ర అత్యధికంగా వెయ్యికి 905 మార్కులు సాధించగా, మొత్తం ఆరుగురిలో ముగ్గురు ఏ–గ్రేడ్, మరో ముగ్గురు బీ– గ్రేడ్ పొందారని ఆయన వివరించారు.



పవిత్ర (905)

అవనిగడ్డ: ఇంటర్ ఫలితాల్లో దివిసీమ విద్యార్థులు సత్తాచాటారు. స్థానిక జెడ్పీహైస్కూల్ ప్లస్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ప్రథమస్థాయిలో నిలిచినట్లు హెచ్ఎం సింహాద్రి రవీంద్రబాబు చెప్పారు. సీఈసీ ఫస్టియర్ విద్యార్థులు ఎనిమిదికి ఎనిమిది, సెకండియర్‌లో ఐదుగురుకి ఐదుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫస్టియర్‌లో వై.నాగరక్షిత 412 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం పొందింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థిని కై తేపల్లి మేఘన సంధ్య 1000కి 954 మార్కులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జిల్లాలో రెండవ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ కేవీ నరసింహారావు తెలిపారు.

విద్యార్థుల విజయభేరి

ఇంటర్ ఫలితాల్లో ఎస్‌వీఎల్ క్రాంతి విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో అల్లంశెట్టి లిఖిత, విస్సంశెట్టి సభిత 1000కి 988 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో మాచవరపు శరణ్యశ్రీ 470కి 464 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ చెప్పారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పలువురు అధ్యాపకులు అభినందించారు.

హైస్కూల్ ప్లస్‌లో బైపీసీ విద్యార్థిని సత్తా

చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల (హైస్కూల్ ప్లస్)లో బైపీసీ విద్యార్థిని కేతరాజు గుణశ్రీ 1000 మార్కులకు 904 మార్కులు సాధించి కళాశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రధానోపాధ్యాయులు కె.బి.ఎన్.శర్మ, అధ్యాపకులు డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి, పావనేశ్వరి, లక్ష్మి, నాగలక్ష్మి, రాజమహేశ్వరీ, మణిమాధవి, సుజాలలు గుణశ్రీని అభినందించారు.



కేతరాజు గుణశ్రీ

చల్లపల్లి: ఇంటర్ ఫలితాలలో స్థానిక విజయ క్రాంతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరెస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ తెలిపారు. ఇందులో ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో అవనిగడ్డ లావణ్యశ్రీ, 1000 మార్కులకు 988 మార్కులు సాధించగా గూడవల్లి దివ్య 1000కి 981 మార్కులు సాధించింది. సీఈసీ ద్వితీయ సంవత్సరంలో బోలెం మానస 1000 మార్కులకు 964 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఎంపిసిలో తుటారాం సాత్విక, మత్తి తేజస్విత, సుదాని పుర్విత 470 మార్కులకు 464 మార్కులు సాధించగా ముద్దినేని చార్మి, మత్తి మౌనిక 470కి 463 మార్కులు సాధించారు. ఉరిమి జాహ్నవి 470కి 461 మార్కులు, గొరిపర్తి ప్రణవి 470కి 460 అత్యధిక మార్కులు సాధించినట్లు కరెస్పాండెంట్ శివరామప్రసాద్ తెలిపారు.

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ రెండు, మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రతిభ కనబరచి మండలలో టాపర్లుగా నిలిచారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని ఏ ఫరాతున్నీసా బైపీసీ గ్రూపులో 1000 మార్కులకు 867 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం పరీక్షల్లో ఎంపీసీ గ్రూపులో షకీనాబీబీ 470 మార్కులకు 460 మార్కులు సాధించింది. రెండో సంవత్సరం పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి తెలిపారు. స్థానిక సాయి సిద్ధార్థ జూనియర్ కాలేజీ విద్యార్థులు మేరీ సుజన ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ గ్రూపు పరీక్షల్లో వెయ్యి మార్కులకు 955 మార్కులు సాధించింది. సీఈసీ గ్రూపులో బడుగు దుర్గామహిత 1000 మార్కులకు 866 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిందని పాఠశాల డైరెక్టరు పి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచినట్లు శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వాగ్దేవీ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల్లో 1000 మార్కులకు వరుసగా టీ సాయిప్రసన్న 977, బి.ప్రవల్లిక 980, పీ మేరీ 977 మార్కులు సాధించారని పాఠశాల డైరెక్టరు ఎం.రఘునాథ్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి అత్యధి మార్కులతో టాపర్లుగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు.



షకీనాబీబీ



టీ సాయిప్రసన్న



పీ మేరీసుజన

ఘనంగా లంకమ్మ అమ్మవారి జాతర

అవనిగడ్డ: దివిసీమ ప్రజల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి భక్తులు తరలి వచ్చారు. దివిసీమతో పాటు బాపట్ల, గుంటూరు జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తుల తాకిడి ప్రారంభమైంది. పశుపోషకులు తమ ఎడ్లబళ్లు, పశువులను ఆలయం చుట్టూ తిప్పి అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి గ్రామోత్సవం గ్రామంలో వీధి వీధిలో భక్తులచే పూజలందుకుంటున్న అమ్మవారు రాత్రికి ఆలయానికి చేరుకుంటారు. లంకమ్మ అమ్మవారి ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా వేలాది మంది భక్తులు అన్నదానం చేశారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పెద్దబ్బాయి పౌండ్రీ వద్ద కవిత నాగేశ్వరశర్మ మిత్ర బృందం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. న్యాయవాది రాయపూడి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ విద్యశ్రీ నేతృత్వంలో అవనిగడ్డ సీఐ యువకుమార్ ఆధ్వర్యంలో ఎస్.శ్రీనివాస్, పలువురు ఎస్ఐలు బందోబస్తుని పర్యవేక్షించారు.



లంకమ్మ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి నెల సంబరం

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి నెల సంబరానికి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ప్రధాన జాతర ముగిసి నెలరోజులు పూర్తికావడంతో శనివారం అమ్మవారి నెలసంబరాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. దూర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రకాశం, గుంటూరు, బాపట్ల, విజయవాడ, మచిలీపట్నం ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రత్యేక వాహనాల్లో జాతరకు తరలిరాగా, గ్రామ రహదారులు వాహనాల రద్దీతో కిక్కిరిశాయి. కృష్ణానది వద్ద కూడా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సంబరాన్ని పురస్కరించుకొని అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. ధ్వజస్తంభం వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి జయశ్రీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు

మచిలీపట్నంటౌన్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మచిలీపట్నం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక జవ్వారుపేటలోని శ్రీ రామకృష్ణ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు శనివారం సరస్వతి పూజ అనంతరం మహాభారతంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే మూర్తి మాట్లాడుతూ రామాయణం వాల్మీకి రచించిన ఒక పురాణ కావ్యమని, ఇది రాముడు, సీత, లక్ష్మణ, హనుమాన్, రావణుల మధ్య జరిగిన యుద్ధం, గుణాత్మక జీవన విధానాల గురించి వివరించిందన్నారు. రామాయణం ప్రధాన సందేశం న్యాయం, ధర్మం, సత్యం, కుటుంబ బంధాలు, వీరత్వం గురించి తెలుగు ప్రజలు ఈ గ్రంథం ద్వారా రాముడు, సీత, లక్ష్మణ్, హనుమానుల పాత్రలను గౌరవించారన్నారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే విధంగా కృషి చేస్తున్న శ్రీ రామకృష్ణ పబ్లిక్ స్కూల్ అధినేత సీహెచ్ రామకృష్ణారావును సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు వింజమూరి శివరాం, పీవీ ఫణికుమార్, మోపర్తి సుబ్రమణ్యం, జీఎస్ ఆర్‌శర్మ, స్కూలు ఉపాధ్యాయురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు స్వీకరించిన విద్యార్థులతో నిర్వాహకులు

జర్నలిస్టులపై అక్రమ కేసులు రాజ్యాంగ విరుద్ధం

ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సద్రుద్దీన్ ఖురేషి

మచిలీపట్నంటౌన్: జర్నలిస్టులపై అక్రమ కేసులు రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సద్రుద్దీన్ ఖురేషి అన్నారు. ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి మరో ఆరుగురు విలేకరులపై పోలీసులు కేసు నమోదు చేయటాన్ని ఆయన తప్పుపట్టారు. ప్రజా సంక్షేమం కోసం పత్రికలు పని చేస్తాయన్నారు. నిజాన్ని నిర్భయంగా నిజాయతీగా ప్రజలకు ప్రభుత్వానికి సమాచారాన్ని అందజేయటంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలక మైనదన్నారు. పలు హత్యలపై వివరాలతో వార్తలు రాయటం, ఈ వార్తలు పోలీసులకు విచారణలో సహకరించడం జరుగుతుంది. సాక్షిలో ఇటీవల హత్య కేసు గురించి వచ్చిన వార్తలపై ఏకపక్షంగా ఎడిటర్‌తో సహా విలేకరులపై కేసులు నమోదు చేయడం, పత్రికాస్వేచ్ఛను హరించడం కాక ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఈ చర్యను ముస్లిం సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇది ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం ప్రతీకార చర్యలో భాగమే. పత్రికా స్వేచ్ఛను హరింపచేయటమేనని ఆయన అన్నారు.



సద్రుద్దీన్ ఖురేషి

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం


మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ఈ నెల 14న దళిత జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని మచిలీపట్నం పరిసరప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో ఉన్న ఎన్ కన్వెన్షన్ హాల్లో ఉదయం 9 గంటల నుంచి విజయవాడ హెల్ప్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. గుండె వ్యాధులకు సంబంధించి ఈసీజీ, ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు. నరాలు, దంత, కంటి, మధుమేహం, బీపీ తదితర వ్యాధులకు చికిత్సలు చేస్తారు. తల, వెన్నునొప్పులు, మెదడు వాపు, మూర్ఛ వ్యాధి, మెదడులో రక్తస్రావం, రక్తం గడ్డ కట్టడం, మెదడులో కణితులు, మెడ, వెన్ను పూస సమస్యలు ఉన్నవారికి ప్రత్యేక వైద్య సేవలు అందుతాయి. ఈ కార్యక్రమంలో దళిత జేఏసీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనంద్‌బాబు (జాని), జిల్లా కార్యదర్శి బేతపూడి రవి, జేఏసీ నాయకులు వంపుగడవల చౌదరి, చిట్టూరి యువరాజు, కొడమంచిలి చంద్రశేఖర్, ఉచ్చుల గణేష్, దోవారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మెగా వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దళిత జేఏసీ నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

బంటుమిల్లి: సేంద్రియ ఎరువుల ఆధారంగా రైతులు సాగు చేస్తే ఆశాజనకమైన దిగుబడులు రావడంతోపాటు భూమి సారవంతం అవుతుందని డివిజనలో మోడల్ మాస్టర్ ట్రైనర్ స్వామిబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆముదాలపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పచ్చిరొట్ట విత్తనాల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి నాగేశ్వరరావు, స్వామిబాబులు సేంద్రియ వ్యవసాయం ఉపయోగాలు, 365 రోజులు రైతులకు ఆదాయాన్ని ఇచ్చే 32 రకాలవిత్తనాలపై అవగాహన కల్పించారు.



పచ్చిరొట్ట విత్తనాలతో అధికారులు, రైతులు

• స్వచ్ఛమైన తాగునీటికి చర్యలు

గుడ్లవల్లేరు: సింగలూరులో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు గ్రామ పంచాయతీ సహకారంతో చర్యలు చేపట్టినట్లు సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తెలిపారు. శనివారం గ్రామంలోని తాగునీటి బావులను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నందం శ్రీనివాసరరావు, మాచర్ల రమణయ్య, ఆకురాతి రాఘవయ్య పాల్గొన్నారు.